క్లుప్తంగా

30న మండల సమావేశం

కూనవరం: మండల పరిషత్ కార్యాలయంలో తేదీ30న ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ పాయం రంగమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఈ.ప్రేమ్‌సాగర్ సోమవారం తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు గత సమావేశపు నివేదికలను తీసుకురావాలని సూచించారు.

కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

రంపచోడవరం : దేవీపట్నం మండలం దామనపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు హెచ్‌ఎం బి.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరానికి బైపీసీలో-40 సీట్లు , ఎంపీసీలో-40సీట్లు, రెండో సంవత్సరం ఎంపీసీలో- 40సీట్లు , బైపీసీలో-16 సీట్లు ఖాళీ ఉన్నట్టు తెలిపారు. వీటిలో 30శాతం గిరిజనేతరులకు ప్రవేశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కాలేజీలో సంప్రదించాలని ఆమె కోరారు.

అందుబాటులో పచ్చిరొట్ట ఎరువులు



లక్కవరపుకోట ఆర్‌బీకేలో ఎరువుల స్టాకు

గూడెంకొత్తవీధి: రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్టు మండల వ్యవసాయశాఖ అధికారి మధుసూదన్‌రావు తెలిపారు. మండలంలోని లక్కవరపుపేట, దేవరాపల్లి, పెదవలస రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. మిగిలిన ప్రాంతాల్లోని ఆర్‌బీకేల్లో కూడా త్వరలో అందుబాటులో తీసుకురానున్నట్టు చెప్పారు. పిల్లిపెసర 8 కిలోల విత్తనాలు రాయితీపై రూ.536లకు, పది కిలోల కట్టేజనుము రూ.440లకు అందిస్తున్నట్టు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ లైన్ ఏర్పాటుకు వినతి



రేంజర్ మూర్తికి వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీలు

ఎటపాక: మండలంలోని వలస ఆదివాసీ గ్రామాలకు విద్యుత్ లైన్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ నెల్లిపాక అటవీశాఖ రేంజర్ మూర్తికి సీపీఎం ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు సోమవారం వినతి పత్రం అందజేశారు. చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి వలస వచ్చి దశాబ్దాల కాలంగా నివాసాలు ఏర్పాటు చేసుకున్న 18 గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. కొన్ని గ్రామాల్లో ఉన్న సోలార్ పథకాలు కూడా పని చేయక ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. నాయకులు రాము, వెంకటేష్, తిరుపతి, భీమయ్య, జోగయ్య తదితరులున్నారు.

ఆదమరిస్తే..ప్రమాదమే

- కూలిన రక్షణ గోడ



కోతకు గురైన బిస్టుంగుడ వంతెన రక్షణ గోడ

అరకులోయ రూరల్: మండలంలో పెదలబుడు పంచాయతీ బిస్టుంగుడ గ్రామ వంతెన ప్రమాదకరంగా మారింది. గత కొద్దిరోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో వంతెన రక్షణ గోడ పూర్తిగా కోతకు గురికావడంతో ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన మీదుగా పలు గ్రామాలకు చెందిన వారు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రిళ్లు వాహనచోదకులు ఈ మార్గంలో ప్రయాణించేందుకు భయపడుతున్నారు.. ఈ మాత్రం ఆదమరిచినా జారిపడి ప్రమాదం బారిన పడే అవకాశాలున్నాయని ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగకముందే ఉన్నతాధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మించాలని స్థానికులతో పాటు వాహనచోదకులు కోరుతున్నారు.

ప్రగతికి చిరునామా సుంకరమెట్ట

- పంచాయతీలో శరవేగంగా పురోగతి
- 30 గ్రామాలకు తాగునీరు కల్పన
- రహదారులకు మోక్షం
- పాఠశాల ఆధునికీకరణ
- అంగన్‌వాడీ భవనం నిర్మాణం
- శరవేగంగా సచివాలయం, ఆర్‌బీకేల పనులు



సుంకరమెట్టలో నాడు-నేడు ద్వారా అభివృద్ధి చెందిన ప్రభుత్వ పాఠశాల



సంఘంవలస గ్రామంలో తారురోడ్డు



సుంకరమెట్టలో పీహెచ్‌సీ భవనం



బంగ్లావలసలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం

అరకులోయటౌన్: నాడు సుంకరమెట్ట పంచాయతీకి వెళ్లాలంటే నరకయాతనే.. గతుకుల రోడ్లతో నిత్యం స్థానికులు ఇబ్బందులు పడేవారు.. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీ పరిధిలోని 30 గ్రామాల్లో మౌలిక వసతులు లేవు.. చంద్రబాబు పాలనలో ఒక్క గ్రామానికి సరైన రహదారి లేక తాగునీటి సదుపాయం లేక గిరిజనులు అల్లాడిపోయేవారు..బిందెడు నీటి కోసం కిలోమీటర్లు వెళ్లాల్సిన దుస్థితి ఉండేవి... అత్యవసర సమయాల్లో అంబులెన్స్ సదుపాయాలు లేక సకాలంలో చికిత్స అందక మృత్యువాత పడిన అమాయక గిరిజనులు కోకొల్లలు.. సుంకరమెట్ట పంచాయతీలో ఒక్క అభివృద్ధి పనిని చంద్రబాబు ప్రభుత్వం చేపట్టలేదు.. ఏళ్ల తరబడి ఆయా ప్రాంత గిరిజనులు సమస్యలతోనే సావాసం చేశారు.. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తరువాత మారుమూల గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. గ్రామాల రహదారులకు మోక్షం లభించింది. ప్రతీ పంచాయతీకి సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకేలు) నిర్మించి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి గిరిజనులకు సేవలందిస్తున్నారు. నాడు-నేడు పథకం కింద రూ. కోట్లు నిధులు మంజూరు చేసి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్ది ఇంగ్లిషు మీడియం బోధన అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెంతకే ప్రభుత్వ సేవలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

- అరకులోయ మండలంలోని సుంకరమెట్ట గ్రామ పంచాయతీలో అభివృద్ధి ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులివీ..

రూ. 6 కోట్లతో 30 గ్రామాలకు తాగునీటి కల్పన

సుంకరమెట్ట, కొత్త భల్లుగుడ గ్రామ పంచాయతీల పరిధిలోని 30 గ్రామాల ప్రజల దాహార్తి తీర్చేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.6 కోట్లు వెచ్చించి గాలి కొండపై నుంచి పైపులైన్ ద్వారా నీటిని తీసుకుచ్చి సుంకరమెట్ట మోడల్ కాలనీ వద్ద భారీ ట్యాంక్‌ల్లో స్టోరేజీ చేస్తున్నారు. అక్కడ నుంచి గ్రామాలకు నిత్యం నీటి సరఫరా చేస్తున్నారు. దీంతో గతంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న గిరిజనులు ప్రస్తుతం తాగునీటి సమస్య లేకుండా ఆనందంగా జీవిస్తున్నారు.

రూ.5.6 కోట్లతో దండబాడు-సంఘంవలస రింగ్‌రోడ్డు నిర్మాణం



జడ్డిపనసలో సామాజిక భవనం



వాటర్ ట్యాంకులు

స్వాతంత్రం సిద్ధించి సుమారు 70 ఏళ్లు గడిచినా తారు రోడ్డుకు నోచుకోని దండబాడు, దుక్కడుడ, సంఘం వలస గ్రామాల గిరిజనులకు జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత రూ. రూ.5.61 కోట్లు వెచ్చించి తారు రోడ్డు నిర్మించారు. గతంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఆదిమ జాతీ గిరిజనులు తారు రోడ్డు నిర్మాణంతో సుఖంగా రాకపోకలు సాగిస్తున్నారు.

రూ.24.14 లక్షల నాడు-నేడు నిధులతో సుంకరమెట్ట పాఠశాల ఆధునీకరణ

సుంకమెట్ట పంచాయతీ కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాల గతంలో అభివృద్ధికి నోచుకోకుండా ఉండేది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రూ.24.14 లక్షల నాడు-నేడు నిధులతో సుంకరమెట్ట పాఠశాల ఆధునీకరణ పనులు చేపట్టారు , పాఠశాల భవనాల ఆధునీకరణ పనులతో పాటు ప్రహరీ నిర్మించి ముఖద్వారం వద్ద పెద్ద గేటు ఏర్పాటు చేశారు. పాఠశాలలో మరుగుదొడ్లు, తరగతి గదుల్లో విద్యుత్ దీపాలు, డిజిటల్ బోర్డులు తదితర ఆధునిక వసతులు కల్పించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంటుందని పాఠశాల యాజమన్యం, పిల్లల తల్లిదండ్రులు చెబుతున్నారు.ఏటా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్టు అధికారులు చెబుతున్నారు.

రూ. 20 లక్షలతో బంగ్లావలసలో అంగన్‌వాడీ భవన నిర్మాణం

అంగన్‌వాడీ భవనం లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్నారుల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రూ. 20 లక్షలు వెచ్చించి అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించారు. వారికష్టాలు తీర్చారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పీహెచ్‌సీ ఆధునీకరణ

సుంకరమెట్టలోని పీహెచ్‌సీ ఆధునీకరణ పనుల తోపాటు ప్రహరీ నిర్మాణం జరిగింది. ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేశారు.

నిర్మాణ దశలో గ్రామ సచివాలయం, ఆర్‌బీకేలు

సుంకరమెట్ట పంచాయతీ కేంద్రంలో రూ. 45 లక్షలతో గ్రామ సచివాలయం, రూ. 20 లక్షలతో చేపడుతున్న ఆర్‌బీకే నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ నిర్మాణాలు పూర్తయితే పంచాయతీ కేంద్రంలోనే అన్ని సేవలు పొందవచ్చు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



జగనన్న ప్రభుత్వంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు. గతంలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. సుంకరమెట్టలో ట్యాంక్ నిర్మించారు. సుంకరమెట్ట, కొత్తభల్లుగుడ పంచాయతీ ప్రజల దాహార్తి తీర్చారు. పైపులైన్ ద్వారా తాగునీటి సదుపాయం కలుగుతుంది. గ్రామస్తుల దాహార్తి తీరింది. – కె.అమర్‌సాయి, బంగ్లావలస, సుంకరమెట్ట పంచాయతీ, అరకులోయ

జగనన్నకు రుణపడి ఉంటాం



దశాబ్దాలుగా మా గ్రామానికి రోడ్డు సౌకర్యం ఉండేది కాదు. రాకపోకలకు నానా అవస్థలు పడేవాళ్లం. జగనన్న ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత కిన్నంగుడ నుంచిదండబాడు, సంఘంవలస మీదుగా జగనంగుడ జంక్షన్ వరకు తారురోడ్డు నిర్మించారు. మా కష్టాలు తీరాయి. రవాణా వ్యవస్థ మెరుగుపడింది. జగనన్నకు రుణ పడి ఉంటాం.

– వంతాల అజయ్, సంఘంవలస గ్రామం, సుంకరమెట్ట పంచాయతీ, అరకులోయ

ఏఈ చొరవతో విద్యుత్ సమస్యకు పరిష్కారం



పాత బ్యాంక్ వీధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేస్తున్న సిబ్బంది

గంగవరం: స్థానిక పాత బ్యాంకు వీధిలో స్థానికులు గత కొన్ని రోజులుగా రాత్రిళ్ల విద్యుత్ సరఫరాలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) మాగంటి దొరబాబు దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. దీనిపై ఆయన తక్షణమే స్పందించారు. ఈ మేరకు సోమవారం ఏఇ దొరబాబు ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ సిబ్బంది పాత బ్యాంక్‌వీధిలో విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. గత కొన్ని రోజులుగా పాత బ్యాంకు వీధిలో విద్యుత్ వినియోగం ఎక్కువ కాడంతో తరచూ సరఫరాలో తరచూ తీవ్ర అంతరాయం కలుగుతుంది. సమస్యను ఏఈ దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి ఆయన చర్యలు తీసుకున్నారు. సోమవారం ఉదయం నుంచి విద్యుత్ శాఖ సిబ్బంది శ్రమించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. జూనియర్ లైన్‌మెన్లు కన్నయ్య , విశ్వనాథరెడ్డి, సిబ్బంది కిశోర్‌బాబు, నాగన్న దొర, గంగరాజు స్థానిక యువకుల సహకారంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను యుద్ధ ప్రాతిపదికన బిగించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన విద్యుత్ శాఖ ఏఈ దొరబాబుకు, సిబ్బందికి స్థానిక సర్పంచ్ కలుముల అక్కమ్మతో పాటు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



అలగాం గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రమేష్

జి.మాడుగుల: మండలంలో లువ్వాసింగి పంచాయతీ అలగాం గ్రామంలో సీఐ రమేష్ సోమవారం పర్యటించారు. గ్రామస్తులకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 4వ తేదీన జరగనున్న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 144సెక్షన్ అమల్లో ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని, గ్రామాల్లోను, పంచాయతీ కేంద్రాల్లోను నిషేధిత ప్రాంతాల్లో గుంపులు, గుంపులుగా జనాలు ఉండడం, గ్రామాల నుంచి జనాలను తరలించటం, సమావేశాలు నిర్వహించటం వంటివి చేయవద్దని సూచించారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, ప్రేరేపించినా వారిపై పోలీసు కేసులు ఉంటాయన్నారు.

కొంకొడికూరకు గిరాకీ



పెదబయలులో కొంకొడికూర అమ్మకాలు

పెదబయలు: మన్యంలో గిరిజనులు అడవుల్లో లభించే అనేక రకాల ఆకుకూరలకు సీజన్‌లో ఆహారంతో తీసుకుంటారు. మే నెలలో కురిసే వర్షాలకు మన్యంలోని అడవుల్లో కొంకొడి ఆకు పెరుగుతుంది. వాటిని సేకరించి గిరిజన రైతులు అమ్మకాలు చేస్తున్నారు.సేకరించిన కొంకొడి కూరను చిన్న చిన్న కట్టలుగా కట్టి వారపు సంతల్లో, మండల కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. ఈ కూరను తోటకూర వండినట్టు పప్పు, రాజ్‌మా, బొబ్బర్లు, కందులతో కలిపి కూరగా వండుకుని తింటారు. కొంత పులుపుగా ఉండే ఈ ఆకు కూరను గిరిజనులు ఇష్టపడి తీసుకుంటారు. ఏప్రిల్, మే నెలల్ల కురిస్తే వర్షాలు ప్రారంభంలోనే దొరుకుతాయి. మిగిలిన కాలాల్లో ఈ కూర దొరకదు. గత వారం మన్యంలో వర్షాలు విరివిగా కురువడంతో ఎక్కువగా కొండల్లో కొంకొడి కూర మెలగెత్తింది. దీన్ని సేకరించిన గిరిజన మహిళలు సంతల్లో అమ్మకానికి తరలించారు. చిన్న కట్ట రూ.15 నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు.ఈ సీజన్‌లో మాత్రమే దొరికే ఈ కూరకు మన్యంలో మంచి డిమాండ్ ఉంది. ఈ కూర అడవీ ప్రాంతంలో చెట్ల కింద, రాళ్ల సందుల్లో మాత్రమే పెరుగుతాయి. కొంకొడి కూరకు తొలకరి కూరగా కూడా దీన్ని పిలుస్తారు.

జగనన్నకే ప్రజల మద్దతు

అరకులోయ రూరల్: రెండోసారి కూడా జగనన్నకే రాష్ట్ర ప్రజలు పూర్తి మద్దతు ఇచ్చి పట్టంకట్టబోతున్నట్టు వైఎస్సార్‌సీపీ యువజన విభాగ అల్లూరి జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఎన్నికుట్రలు చేసినా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేసిన అభివృధి సంక్షేమ పథకాలే జగనన్నను రెండో సారి ముఖ్యమంత్రి పీఠాన్ని కట్టబెడుతున్నారన్నారు. గత ప్రభుత్వాలకు దీటుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు జగనన్నకు ప్రజలే శిరోధైర్యమన్నారు.

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు

రాజవొమ్మంగి: రానున్న విద్యాసంవత్సరానికి సంబంధించి ఇప్పటి నుంచే మండల కేంద్రానికి పాఠ్యపుస్తకాలు దశల వారీగా వస్తున్నాయి. ఇప్పటికే 12,887 పాఠ్య పుస్తకాలు వచ్చాయని, వాటిని స్థానిక గిరిజన సంక్షమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో భద్రపరచామని ఎంఈఓ-2 సూరయ్యరెడ్డి తెలిపారు. సరఫరా అయిన పుస్తకాల్లో 9వ తరగతికి చెంది 5,984 పుస్తకాలు, 10వ తరగతికి చెందిన6, 903 పుస్తకాలు ఉన్నట్టు చెప్పారు. మిగిలిన పుస్తకాలు కూడా త్వరలోనే వస్తాయన్నారు.

అమ్మవారికి 30 తులాల వెండి కాసులపేరు బహూకరణ



అమ్మవారికి కాసులపేరు అలంకరిస్తున్న భక్తులు

కె.కోటపాడు: చౌడువాడ గ్రామ దేవత పెద పైడిమాంబ అమ్మవారికి గ్రామానికి చెందిన భక్తుడు తనకాల జగన్నాథరావు 30 తులాల వెండి కాసులపేరును బహూకరించాడు. ఇక్కడ ఆలయంలో అమ్మ వారి విగ్రహానికి ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో సోమవారం దాత జగన్నాథరావు, దివ్య దంపతులు వెండి నగ అలంకరించారు. మహిమాన్వితం గల అమ్మవారికి రూ.35 వేలతో తయారు చేయించిన కాసుల పేరును బహూకరించడం అదృష్టంగా భావిస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

దేవరాపల్లి: రైవాడ పంచాయతీ శివారు బేతపూడిలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రైవాడ పంచాయతీతో పాటు దేవరాపల్లి నుంచి అధికంగా భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి సంతరించుకుంది. అనంతరం రాత్రికి తెరపై సినిమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పి. ధర్మారావు, తదితర గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలానికి కొలతలు తీస్తున్న రెవెన్యూ అధికారులు

రాజవొమ్మంగి: ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని రాజవొమ్మంగి తహసీల్దార్ డి.వి.సత్యనారాయణ హెచ్చరించారు. స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా స్థలం ఆక్రమణలకు గురవుతున్నట్టు ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు రెండు రోజుల క్రితం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు క్రీడా మైదానం ఆక్రమణపై ఫిర్యాదు శీర్షికతో ‘సాక్షి’లో ఈనెల 26వ తేదీన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఇందులో భాగంగా సోమవారం రెవెన్యూ సిబ్బంది పాఠశాలకు వెళ్లి సర్వే చేయగా సుమారు 130 మీటర్ల స్థలం ఆక్రమణకు గురైనట్టు గుర్తించారు. పాఠశాల స్థలం ఆక్రమిస్తు వేసిన కంచె తొలగించారు. పాఠశాల నాలుగు వైపులా కొలతలు తీశారు. రికార్డుల ప్రకారం ఈ పాఠశాలకు చెందిన సర్వే నెంబర్ 205/ 2బీలో 3 ఎకరాల 82 సెంట్ల భూమి ఉన్నట్టు గుర్తించారు. డిప్యూటీ తహసీల్దార్ అల్లి సత్యనారాయణ, సర్వేయర్లు రాంబాబు, రమణారెడ్డి, వీఆర్వో సూర్యాకాతం, పాఠశాల హెచ్‌ఎం గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



గొందూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పాడేరు రూరల్(హుకుంపేట): వ్యక్తిగత పరిశుభ్రతపై స్త్రీలు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.ఊర్మిల అన్నారు. భేటీ భచావో.. భేటీ పడవో కార్యక్రమంలో భాగంగా సోమవారం పాడేరు మండలంలోని సీడీపీవో ఆదేశాల మేరకు సిబ్బంది గుడివాడ, ఎంకే వీధి, పి.గొందూరు, చింతలవీధి, గుత్తులపుట్టు గ్రామాల్లో కిశోర బాలికలతో అంగన్‌వాడి సిబ్బంది అవగాహన ర్యాలి నిర్వహించారు.ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు స్త్రీలు సమాజంలో గౌరవంగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. కిసోర బాలికలకు నెలసరి సహజమని ఈ సమయంలో కడుపునొప్పి,నీరసం రావచ్చోని ఈ సమస్యలు వస్తే వెంటనే వైద్యులకు సంప్రదించాలని సూచించారు. నెలసరి సమయంలో తరచూ నాప్కిన్ మార్చుకుంటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పెద పైడిమాంబ పండగ

కె.కోటపాడు: చౌడువాడ గ్రామ దేవత పెద పైడిమాంబ అమ్మవారి పెద్ద పండగను మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి పండగను ఐదేళ్లకోసారి నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఆది, సోమవారాల్లో ఇక్కడ ఆలయ ప్రాంగణంలో భారీ ప్రభ ప్రదర్శించారు. ఊరికట్టు కార్యక్రమాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఇతర ప్రాంతాలకు ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వెళ్లిన వారు అమ్మవారి పెద్ద పండగ సందర్భంగా తిరిగి గ్రామానికి చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. మరోవైపు గ్రామాన్ని, గుడిని విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు. అమ్మవారి ఆలయంలో దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గ్రామ పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కె.కోటపాడు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు.

సంస్కృత శిక్షణ తరగతులు ప్రారంభం

అనకాపల్లి:స్థానిక చిన్నరాజుపేట చౌడేశ్వరీ సాంబశివ దేవాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం అధ్యాపకులచే సంస్కృత భారతి పేరిట సంస్కృతం శిక్షణ తరగతుల్ని 10 రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు నందనశర్మ తెలిపారు. ఆలయ ఆవరణలో సోమవారం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. భారతీయ సంప్రదాయానికి మూలమైన సంస్కృతం నేర్చుకోవడం ద్వారా జ్ఞాపక శక్తి, గ్రహణశక్తి పెరిగి, బుద్ధి ప్రచోదనం కలుగుతుందన్నారు. మన శ్లోకాలను సరళంగా పలకడమే కాకుండా, సులభంగా మాట్లాడగలమన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ తరగతులు నిర్వహించనున్నట్టు చెప్పారు.